కథా నిలయం
శ్రీకాకుళం

తెలియని నిజాలు

"నీలమ్, ఏక్ కప్ చాయ్ బనాకే లానా" స్వప్న ఆఫీసు నించి వస్తూనే అలసటగా చేతిలోని హ్యాండుబాగు, చున్నీ తీసి ఓ సోఫాలో పడేసి, మరో సోఫాలో వాలింది, వంటింటివైపు కేకపెట్టి.

"స్వప్నా టీ తీసుకోమ్మా" రాజేశ్వరి కోడలి చేతికి టీ కప్పు అందిస్తూ మృదువుగా అంది.

స్వప్న కళ్లు తెరిచి చటుక్కున లేచి కూర్చుని "అయ్యో మీరు తెచ్చారేంటి అత్తయ్యగారూ! నీలమ్ లేదా వంటింట్లో" నొచ్చుకుంటూ అంది.

"పరవాలేదమ్మా ఎవరు తెస్తేనేమిటి, నీలమ్‌ని కొత్తిమీర, మిర్చి అవి తెమ్మని నేనే బైటికి పంపాను. టీ చేసినంత మాత్రాన అరిగిపోను, పనిపాటులేక తోచడంలేదు నాకు" అంది రాజేశ్వరి.

టీ తాగి హడావిడిగా లేచిన కోడలిని చూసి "ఏమిటివాళా వెళ్లాలా మీ 'ఆవా'కి (Airforce Officers Wives Association' A.O.W.A.) బాగానే ఉంది. ఈ ఉద్యోగంతో పాటు ఆ ఉద్యోగం - సాయంత్రం ఇంటికొచ్చి కాస్తన్నా విశ్రాంతి లేకుండా ఈ చాకిరి ఏమిటమ్మా" అందామె సానుభూతిగా.

"ఏం చెయ్యమంటారత్తయ్యా ఇది ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ల భార్యలకి తప్పని డ్యూటీ. ఈ చాకిరి తప్పించుకోలేం. కాదనడానికి లేదు. ఈ యూనిట్ C.O. (Comonding Officer) భార్య మా 'ఆవా'కి ప్రెసిడెంటు అవుతుంది. ఆవిడ మా బాస్. ఆవిడ చెప్పినట్టు చెయ్యాలి మేం. మీరు ఎల్లుండి వెళతారనిచెప్పి రేపు ఎగ్గొట్టాను."

"బాగానే ఉంది. అటు ఆఫీసు ఇటు ఈ చాకిరి అయి తొమ్మిదింటికి నీరసంగా వస్తే ఇంక ఇల్లు పిల్లలని ఏం చూస్తావు? అంది రాజేశ్వరి.

"ఇదంతా ప్రతిరోజూ ఉండదులెండి. మా ఎయిర్‌ఫోర్స్ ఏనివర్సరి, ఎయిర్ మార్షల్స్‌లాంటి పై అధికారులు వచ్చినప్పుడు, స్వాతంత్ర్యదినాలు, హోలి వగైరా పండగలకి మా లేడీస్ క్లబ్బులు ఫంక్షన్ ఏర్పాట్లు, డిన్నరు ఏర్పాట్లు చెయ్యాలి. అలాంటి సందర్భాలలో ఓ వారం పది రోజులు వెళ్లాలి ఏర్పాట్లకి."

స్వప్న కప్పు లోపల పెట్టి, బాత్‌రూమ్‌లో మొహం కడుక్కుని ఫ్రెష్ అయివచ్చి "వస్తానత్తయ్యా. నేరావడం ఆలస్యం అవచ్చు. నీలమ్ రొట్టెలు చెయ్యగానే మీరు తినేయండి" అంటూ వెళ్లిపోయింది.

స్వప్న వెళ్లగానే రాజేష్ జీపుదిగి లోపలికొచ్చాడు.

"అమ్మా, స్వప్న వెళ్లిపోయిందా" అడిగాడు.

"ఆ... తను అలా వెళ్లింది నీవిలా వచ్చావు. పాపం ఆఫీసు నుంచి వస్తూనే పరుగులు పెడ్తోంది. అయినా ఇదేం చాకిరీరా బాబూ" అంది రాజేశ్వరి.

బూట్లు విప్పుకుంటూ రాజేష్ నవ్వాడు. "తప్పదమ్మా ఇక్కడ ఇదంతా. ఎవరూ చెయ్యకపోతే ఫంక్షను పార్టీలు ఆర్గనైజ్ ఎవరు చేస్తారు. మా ఆఫీసర్ల డ్యూటీల్లా ఆఫీసర్ల భార్యలకీ డ్యూటీలు తప్పవు. ఏడాదికి అయిదారుసార్లు ఇలా ప్రోగ్రాంలు చెయ్యాలి. ఓ పది పదిహేనురోజులు వెళ్లాల్సొంటుంది అలాంటప్పుడు."

"అందరి ఆఫీసర్ల భార్యలూ వెడతారా...?"

"మరీ చంటిపిల్లల తల్లులని వదిలేస్తారు. అమ్మా ఇక్కడ కాస్త స్మార్ట్‌గా, ఇంగ్లీషు అది బాగా వచ్చిన వాళ్ళని అసలు వదలరు. స్వప్నకి ఈ డ్యూటీ తప్పదు. బట్టలు మార్చుకు వస్తాను" లోపలికెళ్లాడు రాజేష్.

"మామ్మా ఏం చేస్తున్నావు. ఒక్కర్తివీ బోరుకొడ్తుందా" రాహుల్ వచ్చి మామ్మ దగ్గిర కూర్చున్నాడు.

"హోమ్‌వర్క్ అదీ అయిందా నాన్నా" మనవడి తల నిమురుతూ అడిగింది రాజేశ్వరి.

"మామ్మా కాసేపు 'కెనస్టా' ఆడుదాం రా" పేకముక్కలను తీస్తూ అన్నాడు రాహుల్.

"పరీక్షలపుడు పేకాట ఏమిటని మీ నాన్న కేకలేస్తాడేమో, సరేలే ఓ అరగంట ఆడుదాం. చదివి చదివి నీకూ బోరుకొడ్తొందా" ఆప్యాయంగా అంది.

"రాహుల్ పరీక్షలు పెట్టుకుని పేకాడుతున్నావా?" బట్టలు మార్చుకు వచ్చి నీలమ్ అందించిన టీ అందుకుంటూ రాజేష్ అన్నాడు.

"లేదురా పాపం ఇప్పటివరకు చదువుతూనే ఉన్నాడులే. కాసేపు వాడికీ విశ్రాంతి కావాలిగా..." మనవడిని వెనకేసుకువచ్చి అంది రాజేశ్వరి.

"నీకూ తోచడం లేదుగా – కాసేపు ఆడుకోండి. రాకరాక నీవొస్తే సాయంత్రాలన్నా ఇంట్లో ఉండకుండా తనకీ డ్యూటి పడింది" అన్నాడు రాజేష్.

"అవును నాకు తెలీక అడుగుతా, ఇంట్లో చుట్టాలున్నారు – పిల్లలకి పరీక్షలు – నేను రాలేను అని చెప్పకూడదా – అంత భయపడడం ఏమిటి?" అందామె.

"అమ్మా అందరికి ఇల్లు, సంసారం, పిల్లలుంటారు. ఎవరూ చేయకుండా తప్పించుకుంటే ఎలా అంటుందావిడ. అందులో స్వప్న డాన్సులు, చిన్న చిన్న టిట్‌బిట్స్ ప్రోగ్రామ్‌లు బాగా అరేంజ్ చేస్తుంది. అంచేత మిసెస్ రాథోడ్ అసలు వదలదు స్వప్నని.

ఓసారి ఇలాగే తనకి విసుగొచ్చి పనుంది రాలేనని తప్పించుకుంది. రెండు రోజుల తరువాత మా C.O. ఆఫీసులో నాకు క్లాసు తీశాడు.

"మేడమ్ చాలా అప్‌సెట్ అయింది. ఎయిర్ మార్షల్ నాల్గురోజులలో వస్తున్నాడు. అందరూ ఇంత బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తే ఆవిడ ఒక్కర్తి ఎలా చేయగలదు. ఇది మనందరి యూనిట్ అంతటికీ సంబంధించిన విషయం. మిసెస్ స్వప్నని రేపు పంపించు" అన్నాడు అథారిటిగా. ఇంకేం చేస్తాం అలాంటపుడు."

"మమ్మీ ఇంతకు ముందు పోస్టింగ్‌లో తనకేం రానట్టు, తెలీనట్టు క్లబ్బులో ఓ మూల కూర్చుంది మొదట్లో" స్వీటీ ఏదో చెప్పబోయింది.

"ఆ నాటకమూ ఫెయిల్ అయింది. మేం ఇదివరకున్న యూనిట్ బాస్ ఆఫీసు పనిమీద వచ్చి పార్టీలో స్వప్నని చూసి 'ఓ మిసెస్ స్వప్నా... ఇక్కడుండగా 'సుష్మాజీ' నిశ్చింతగా ఉండచ్చు పార్టీల ఆర్గనైజింగ్ విషయంలో, స్వప్న ఈజ్ ఎ వెరీ గుడ్ ఆర్గనైజర్' అని పొగిడి పొగిడి మరీ మెచ్చుకున్నాడు."

అతనన్నది విని మా బాస్ భార్య మొహం ఎర్రబడింది. మా మొహాలు నల్లబడ్డాయి.

తరువాత ఆవిడగారిని ప్రసన్నురాలిని చేసుకోడానికి ఇడ్లీలు, దోశలు పంపి, డిన్నర్లకి పిలిచి నానా తంటాలు పడ్డాం" రాజేష్ చిన్నగా నవ్వుతూ అన్నాడు.

"బాగానే ఉంది కాస్త స్మార్ట్‌గా ఉండడం తప్పన్నట్టుంది ఇక్కడ" అంది రాజేశ్వరి నవ్వి.

"అమ్మా ఎనిమిదన్నర అయింది. నీవు భోజనం చేసేయ్" అన్నాడు రాజేష్.

"పరవాలేదురా అందరం కలిసే తిందాం. తిని కూర్చుంటే అరగడంలేదు" అందామె.

* * * * * *

మర్నాడు రాజేష్ ఇంటికి వస్తూనే "స్వప్నా బ్యాడ్ న్యూస్ ఫర్ యూ" అన్నాడు అదోలా నవ్వి.

స్వప్న రాజేష్ మొహం వంక చూసి విషయమేమిటో అర్థం చేసుకుని "పోస్టింగ్ వచ్చేసిందా" కళ తప్పిన మొహంతో చిన్నగా అడిగింది.

"ఆ... జోధ్‌పూర్ ఆర్డర్లు వచ్చేశాయి" అంటూ కాగితం టీపాయ్ మీద పడేశాడు. ఎదురుచూస్తున్న విషయమే అయినా స్వప్న పెద్ద ఆపద నెత్తిన పడ్డట్లు నిస్పృహతో కుర్చీలో కూలబడింది.

"ఏమిటి అలా అయిపోయావు. పోస్టింగ్ వచ్చే టైమయిపోయింది ఇవాళ రేపో వస్తాయని తెల్సుగా. ఇదేం కొత్తా మనకు" ఓదార్పుగా అన్నాడు.

"మీకేం చెపుతారు. మళ్లీ ప్యాకింగ్ మొదలు. మళ్లీ ఆ ఊర్లో నా ఉద్యోగాల వేట మొదలు, మళ్లీ మెస్‌లో పడి ఉంటూ ఇళ్లకోసం ఎదురుచూపులు. పిల్లి పిల్లల్ని తిప్పినట్టు నాలుగిళ్లు మారడం. పిల్లలకి అక్కడ మంచి స్కూల్సు ఉన్నాయో లేదో" అంది.

"ఏమిటి డాడీ పోస్టింగ్ ఎక్కడికొచ్చింది. జోధ్‌పూరా" రాహుల్ గదిలోంచి వచ్చి అడిగాడు.

రాజేశ్వరి, స్వీటీ చుట్టూచేరారు.

"రాజస్థాన్ – అమ్మో అక్కడ ఎండలు. నీళ్ల ఇబ్బందిగా ... ఎప్పుడెళ్లాలి" రాజేశ్వరి అడిగింది.

"ఈ ఢిల్లీ కంటె ఎండలేం ఎక్కువ కాదులే. అక్కడ మా యూనిట్లకి నీళ్ల ఇబ్బంది

ఉండదు. పిల్లల పరీక్షలు అవి అయ్యేవరకు ఇల్లు ఉంచుకోవచ్చు. నేను పదిరోజులలో వెళ్లి జాయిన్ అవాలి" అన్నాడు.

రాజేశ్వరి కోడల్ని సానుభూతిగా చూసింది. ఎప్పుడు ట్రాన్స్‌ఫర్ అయినా సామాను సర్దడం బాధలు, ఇల్లు వెంటనే దొరకని అవస్థలు ఎన్నోసార్లు చెప్పింది.

"మనం ఈ ట్రాన్స్‌ఫర్‌కే ఇంత బెంగపడుతున్నాం. మీనన్‌కి ఎక్కడికి పోస్టింగ్ వచ్చిందో తెలుసా" స్వప్న వంక చూస్తూ అన్నాడు రాజేష్.

"వాళ్లకి కూడా పోస్టింగ్ వచ్చిందా, ఎక్కడికి వేశారు." స్వప్న ఆరాటంగా అడిగింది.

"సి యా చిన్" అని చెప్పాడు రాజేష్.

బాంబు పేలినట్టు ఉలిక్కిపడింది స్వప్న.

"ఓ మైగాడ్ సియాచిన్.. పాపం మీనన్ పని అయిపోయింది. ఎలా మేనేజ్ చేస్తారో.. జ్యోతి అసలే పిరికిది. ఎలా రియాక్ట్ అయిందో" ఆందోళనగా అంది.

మీనన్ ఆర్మీలో మేజర్. అయినా ఆ యూనిట్‌లో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ ఉన్న యూనిట్. ఇద్దరిళ్లు పక్కపక్క నుండడం - మీనన్ మలయాళి అయినా భార్య జ్యోతి హైదరాబాద్‌లో పెరిగి బాగా తెలుగు రావడం - ఇద్దరి వయసు ఒకటవడం, వాళ్ల పిల్లలు వీళ్ల పిల్లలు స్కూలు ఒకటవడం ఆ కారణంగా రెండు కుటుంబాల మధ్య మంచి స్నేహం కుదిరింది రెండేళ్లుగా.

అందులో మీనన్ సరదా అయిన వాడు. స్నేహానికి ప్రాణం పెట్టే రకం. ఏ కాస్త సమయం దొరికినా రెండిళ్ల వాళ్లు కబుర్లాడుకుంటూ ఆ వేళకి ఎక్కడుంటే అక్కడ భోజనాలు కానివ్వడం. వాళ్ల స్నేహం ముచ్చటైంది.

"ఫోనులోనే బెంబేలు పడిపోయాడు పాపం మీనన్. జ్యోతికి ఈ వార్త చెప్పగానే ఫోనులోనే ఏడ్పు ఆరంభించిందిట" రాజేష్ బాధగా అన్నాడు.

"నాకు తెలుసు జ్యోతి అసలు తట్టుకోలేదు. ఉత్తపిరికిది. ఓసారి వెళ్లి వద్దాం. కాసేపు కూర్చుని ధైర్యం చెప్పివద్దాం..." స్వప్న ఆందోళనగా అంది.

"ఏమిటి సియాచిన్ అంటే హిమాలయ పర్వత శిఖరాల దగ్గరకదా - అంత భయపడుతున్నారేమిటి - అక్కడ చలి విపరీతంగా ఉంటుందనా" రాజేశ్వరి వాళ్ళ గాభరా చూసి అడిగింది.

"అమ్మా సియాచిన్ అంటే ఏమిటనుకుంటున్నావు. మైనస్ '60' డిగ్రీల టెంపరేచర్.

ఇరవై రెండువేల అడుగుల ఎత్తులో, ఎటుచూసినా మంచు ముద్దలు, చలిగాలులు, ఊపిరి అందడమే కష్టంగా ఉండేంత ఆ ఎత్తులో, గ్లాసులో నీరు తాగే లోపలే గడ్డ కట్టించే చలిలో ఓ ఏడాది ఉండడం అంటే తమాషాగాదు.

నీవు బదరి, కేదార్‌నాథ్‌లు 10, 12 వేల అడుగుల ఎత్తులో ఉన్నచోట్లకి వెళ్లినపుడు సరిగ్గా ఊపిరి అందక ఆయాసపడ్డావుగదా - అంతకు రెట్టింపు ఎత్తులో ఉండడం - భార్యాపిల్లలని ఓ ఏడాది పాటు చూడడానికి కూడా రాలేరు... అలాంటి చోటకి వెళ్లాలంటే ఎవరికి భయంగా ఉండదు" అన్నాడు రాజేష్.

"ఏం ఫ్యామిలినీ చూడడానికి ఎందుకు రాలేరు" ఆశ్చర్యంగా అడిగింది రాజేశ్వరి.

"అమ్మా ఇరవై రెండువేల హై ఆల్టిట్యూడ్‌లో మనిషి ఊపిరి పీల్చలేడు. ఒక్కసారిగా మనుష్యులని అక్కడ తీసుకెళ్లి వదిలితే 'ఆక్సిజన్' అందక చనిపోతారు - బేస్ క్యాంపునించి మొదలు పెట్టి క్రమంగా హైట్ పెంచుతూ 5, 10, 15, 20 వేల అడుగులలో అలవాటు చేసి ఆఖరికి ఆ ఆల్టిట్యూడ్ అలవాటయ్యేట్లు తీసికెళతారు. అలా అయినా ఆక్సిజన్ ఎక్కించాల్సుంటుంది.

సెలవుమీద పంపితే మళ్లీ ముందునించి మొదలెట్టాలి. ఒక్కో క్యాంపులో నెల చొప్పున ఉంచుతూ ఆఖరి క్యాంపు చేర్చి అక్కడ మూడు నెలలు ఉన్న తరువాత క్రమంగా మళ్లీ దింపడం ఇదంతా ఓ ఏడాది ప్రోగ్రామ్" రాజేష్ విడమర్చి చెప్పాడు.

"మరి డాడీ అంటార్కిటిక్‌లో కూడా ఇంతే చలీ ఉంటుంది గదా ! మరి ప్రజలు ఎలా ఉండగలుగుతున్నారు అక్కడ - రాహుల్ సందేహం.

"గుడ్ క్వశ్చన్ - అంటార్కిటిక్‌లో చలి ఇలాగే ఉంటుందిగాని హైట్, ఆల్టిట్యూడ్ సమస్య ఉండదు. అంతేకాక పుట్టినప్పటి నుంచి ఆ వాతావరణంలో పెరుగుతారు కనుక వారికి అలవాటయిపోతుంది.

రాజేష్ మాట్లాడుతుండగానే మీనన్ దంపతులు వచ్చారు. స్వప్న ఎదురెళ్లి జ్యోతి చెయ్యి పట్టుకుంది ఓదార్పుగా. జ్యోతి మొహం పదిలంఖణాలు చెసినట్టు పీక్కుపోయి కళ్లు ఏడ్చినట్లు ఉబ్బి ఉన్నాయి.

"కమాన్ యార్. మేమే మీ ఇంటికి వద్దామనుకున్నాం. జ్యోతి మాట సరే స్వప్న గాభరాపడిపోయింది. నీ ట్రాన్స్‌ఫర్ విషయం విని" స్నేహితుడికి షేక్‌హ్యాండ్ ఇచ్చి కూర్చోపెట్టాడు రాజేష్.

"ఏం చేస్తాం స్వప్నా - ఎప్పుడో అప్పుడు ఈ పోస్టింగ్ తప్పదు కదా. వంతుల వారిగా అందరూ వెళ్లాల్సిందే - గదా" మీనన్ చిన్నగా నవ్వి అన్నాడు.

"తల్చుకుంటేనే గాభరాగా ఉంది. ఎలా ఉంటారో అక్కడ - మేం ఇక్కడ ఒంటరిగా ఎక్కడుండాలి - మీరూ వెళ్లిపోతున్నారు" బెంగగా అంది జ్యోతి.

"ప్రవరాఖ్యుడికి హిమాలయాల్లో ఏవో ఆకుపసర్లు దొరికి వేళ్లకి రాసుకుని ఎగిరాడు. అట్టాంటి ఆకులేమన్నా దొరికితే నేను మధ్య మధ్య వచ్చి చూసిపోతుంటాలే" జోక్యులర్ అన్నాడు మీనన్.

జ్యోతి కోపంగా చూసింది. "చూడు ఎలా జోకులు వేస్తున్నారో భయంతో చస్తుంటే" ఉక్రోషంగా అంది.

"అసలు నాకుతెలీక అడుగుతాను. అంత ఎత్తున ఆ మంచుపర్వతాలు దాటి ఎవరొస్తారని ఈ కాపలా కాయడం. అక్కడ మిలట్రీ స్థావరాల అవసరం ఏమిటి?" రాజేశ్వరి సందేహం వ్యక్తం చేసింది.

"ఏంటమ్మా అలా మాట్లాడ్తున్నావు. పేపర్లలో వార్తలు చదవడంలేదా. ఇండియా, పాకిస్తాన్ బోర్డరు గొడవలు, కాపలాగా మిలట్రీ లేకపోతే పాకిస్తాన్ మిలట్రీ వచ్చేసి ఆక్రమించుకుంటుంది" రాజేష్ అన్నాడు.

"ఆంటీ మీనరనుకున్నట్టే అక్కడ నరమానవులెవరూ ఉండలేరు. అటునించి ఏ ముప్పూ ఉండదని మనవాళ్లు పాకిస్తాన్ వాళ్లు 1947లో విడిపోయినపుడు ఆ స్థావరాల గురించి ఎవరూ ఎంతమాత్రమూ పట్టించుకోకుండా వదిలేశారు. 1947 కరాచి అగ్రిమెంటులోగాని, 1972 సిమ్లా అగ్రిమెంటులోగాని 'లైన్ ఆఫ్ కంట్రోలు'లో సియాచిన్ ప్రాంతం లేదు.

కాని 1980 తరువాత నెమ్మది నెమ్మదిగా పాకిస్తాను పర్వతారోహణ పేర, కొంతమందికి పర్మిషను ఇచ్చి పైకి పంపి ఆ ప్రాంతం వారిదేనన్నట్టు జండాలు పాతి, గుడారాలు వేసి నెమ్మదిగా మౌంట్‌నీరింగ్ పేరిట స్థావరాలు ఏర్పరుచుకోవడం మొదలుపెట్టారు.

'80లో మన రక్షణశాఖ ఆ ప్రాంతాలన్నీ పాకిస్తాన్ లైన్ ఆఫ్ కంట్రోల్‌లో ఉన్నట్టు అమెరికా మ్యాపుల్లో గుర్తించాక మన వైపునుంచి కొంతమందికి 'పర్వతారోహణ'కి పర్మిషన్ ఇచ్చి పంపి అక్కడ పరిస్థితులన్నీ గుర్తించి, పాకిస్తాన్ ఆ ప్రాంతంలో దురాక్రమణకి తయారవుతున్నట్టు గుర్తించి 1984లో 'ఆపరేషన్ మేఘదూత్' పేరిట

హెలికాప్టర్లలో మన సైన్యాన్ని దించి పాకిస్తాన్ సైన్యాన్ని వెనక్కి పంపి సియాచిన్ ప్రాంతం అంతా 78 కిలోమీటర్లు పైన స్వాధీనం చేసుకుంది.

దాడికి ఎదురుచూడని పాకిస్తాన్ సైన్యాన్ని రప్పించి ఎదురుదాడికి దిగినా ఎత్తులో ఉండి అప్రమత్తమైన ఇండియా సైన్యం దెబ్బకి వెనుదిరిగింది. అప్పటి నించి రెండు వైపులా మిలటరీ స్థావరాలు నెలకొల్పారు.

అప్పటినించి పోగొట్టుకున్న స్థావరాల కోసం 90, 95, 96, 99లలో పోరాడుతున్నా పాకిస్తాన్ వారికి సియాచిన్ గ్లేసియర్‌లో దక్కింది కేవలం 5 కిలోమీటర్లే. వాళ్ళకి మైనస్‌పాయింట్ ఎత్తు ఎక్కి రావడం – అది ఇండియన్ ఆర్మీ అప్రమత్తంగా ఉండడంతో కుదరలేదు.

ఆఖరికి 2003లో సీజ్‌ఫైర్ డిక్లేర్ చేశాక ఎవరి పోస్టుల్లో వారుండాలి తప్ప కాల్పులు జరపరాదు అని నిర్ణయానికి వచ్చేసరికే మనం దాదాపు రెండువేల మంది సోల్జర్స్‌ని పోగొట్టుకున్నాం. 300 మిలియను డాలర్లు ఖర్చు అయిందిట" మీనన్ చెప్తుంటే అందరూ శ్రోతలై ఆశ్చర్యంగా వినసాగారు.

"సియాచిన్ ప్రాంతంలో సైన్య స్థావరాలకి ఇప్పటి వరకు 50 బిలియన్లు ఖర్చు అయిందట."

"అంతత ఖర్చా... అయ్యబాబోయ్... " రాజేశ్వరి కళ్లు పెద్దవిచేస్తూ ఆశ్చర్యంగా అంది.

"ఆంటీ వింటే మీరు ఆశ్చర్యపోతారు. అక్కడ బేస్ స్థావరాల యూనిట్ల కోసం కిరసనాయిలు, రేషన్లు సప్లయ్ చేయడానికి మన రక్షణ శాఖ రోజుకి కోటిరూపాయలు ఖర్చు పెడ్తోందన్నది తెలుసా. మనకి ఒక బ్రెడ్ పదిరూపాయలయితే ఆ ప్రాంతాలకి పంపేసరికి ఒక బ్రెడ్ రెండొందలు పడ్తుంది. ఎందుకంటే అన్ని సామాన్లు అక్కడికి హెలికాప్టర్ల మీద పంపాలి.

సైన్యానికి కావల్సిన ఆహార పదార్థాలు, మందులు, కిరసనాయిలు, పేపర్లు, పుస్తకాలు ఏది పంపాలన్నా హెలికాప్టర్లే గతి. అక్కడున్న చెక్‌పోస్టులు అన్నీ కలిసి మూడు వేలమందికి అన్నీ సరఫరా చేయడానికి పగలంతా హెలికాప్టర్లు చక్కర్లు కొడుతూనే ఉంటాయి. అక్కడికి మామూలు హెలికాప్టర్లు వెళ్లలేవు. 'చీలే' అనే ప్రత్యేకమైన తేలిక హెలికాప్టర్లు (Advanced Light Helicopter - ALH) మాత్రమే అంత ఎత్తు ప్రదేశానికి గాలి తక్కువ ఉండే ప్రాంతంలో ఎగరగలవు.

మామూలు చోట ఓ ట్రిప్పులో ఒకటిన్నర టన్నులు బరువు తీసికెళ్లగలిగే హెలికాప్టర్లు హై ఆల్టిట్యూడ్ ప్రదేశంలో కేవలం 50, 60 కిలోల బరువు మాత్రమే తీసికెళ్లగలవు. ఓ ట్రిప్పులో 50 లీటర్ల కిరసనాయిలు క్యాన్ మాత్రమే తీసికెళ్లగలవు. అంటే ఎన్ని ట్రిప్పులు వేయాలో చూడండి – ఇరవైవేల అడుగుల ఎత్తులో 'సోనమ్' అనే చోట మంచులో ఒక హెలీ పాడ్ కట్టారు.

సియాచిన్ ప్రాంతంలో ఆక్సిజన్ శాతమెంతో తెల్సా – 10 శాతం మాత్రమే. ఆ కారణంగా మామూలు చోటకంటె ఎన్నో రెట్లు పెట్రోలు ఖర్చు అవుతుంది.

"ఎందుకంకుల్" స్వీటీ అమాయకంగా అడిగింది.

"మన కారు ఎత్తు ఎక్కాలంటే గేరు మార్చాలి. గేరు మార్చి ఎత్తు ఎక్కడానికి పెట్రోలు ఎక్కువవదూ అలాగే ఇదీనూ – అక్కడ కిరసనాయిలులేనిదే క్షణం గడవదు. స్టవ్‌లు, హీటర్లు అలా వెలుగుతూంటాయి. మంచినీళ్లు తాగాలన్నా ఐసుగడ్డ కరిగించి తాగాలి. అక్కడ చలి ఎలా ఉంటుందంటే వేడివేడి నీళ్ళు బాల్చీలో పెడితే 15, 20 నిమిషాల్లో ఐస్ అవుతుందట.

అన్నివేల మందికి ఆహారం వేడి చెయ్యడానికి, కాఫీ, టీలకి, నీళ్ళకి ఎన్నివేల లీటర్ల కిరసనాయిలు ఖర్చు – అంచేత మన ఆర్మీ ఇంజనీర్లు ఆ మంచు కొండలలోంచి 121 కి.మీటర్ల పైపులైన్లు కేవలం కిరసనాయిలు సప్లయ్ చేయడానికి వేశారుట. ఆ చలికి పగలని పైపులతో ఆ లైను వేయడానికి కీలోమీటరుకి నాల్గు లక్షల ఖర్చుతో వేశారట. ఆపైపులైను అన్ని లక్షల ఖర్చుతో వేసినా, దానివల్ల నెలకి ఎన్నోకోట్లు మనవాళ్ళు ఆదా చేయగలుగుతున్నారట ఇపుడు..." మీనన్ అదంతా కథలా వర్ణించి చెప్తుంటే వింటున్నారు అందరూ.

"ఈ సంగతులన్నీ మాలాంటి మామూలు వారికి అసలు తెలియవు. ఏదో యుద్ధం వచ్చినపుడు సైనికుల త్యాగాలని పాటలుపాడి హారతులివ్వడం మినహా లోపల లోపల రక్షణశాఖలో సైన్య సిబ్బందిపడే ఈ పాట్లు తెలియవు..." రాజేశ్వరి ఉద్వేగంగా అంది.

"మీకేంటి ఆంటీ – మాకూ అన్నీ తెలియవు. రక్షణ శాఖ రహస్యాలు వెల్లడించరు పైకి.

నిజానికి ఈ ఆపరేషన్ కోసం ఎంతమందిని వినియోగిస్తున్నారో – ఎంత మంది చనిపోయారో.

ఎన్ని మిలియన్లు ఖర్చు అయ్యేది అంతా ఉన్నతాధికారులకి, రక్షణ మంత్రిత్వ శాఖకి మాత్రం తెలుస్తాయి. ఈ పోస్టింగ్ వచ్చిన తరువాత ఇవాళ ఇంటర్నెట్‌లో కొన్ని విషయాలు చదివాను" అన్నాడు మీనన్.

"ఇంకా చెప్పండి అంకుల్. అక్కడ మనవాళ్ళు చలిలో ఎక్కడుంటారు. ఎన్ని కోట్లు తొడుక్కుంటే చలి ఆగుతుంది. అక్కడ భోజనం ఏం చేస్తారు... బాత్‌రూము లుంటాయా?" అని అడిగాడు రాహుల్.

"డోన్ట్ బి సిల్లీ మై బాయ్... స్వెట్టర్లు, కోట్లు మన ఢిల్లీ చలికే చాలవు. అక్కడ వాళ్ళ కోసం (High Altitude weather gear) అని ప్రత్యేక వాతావరణ గేర్స్ అంటే లోపల ఇన్సులేషన్ పెట్టి తయారు చేస్తారు. అవి ఒక్కొక్కటి ఎంతో తెలుసా లక్ష, లక్షన్నర. ఆ డ్రెస్సు - ప్రత్యేకంగా తయారైన బూట్లు, గ్లవ్స్, ఆక్సిజన్ మాస్కులు ఇన్ని వేసుకున్నా ఆ మైనస్ 60డిగ్రీల చలి తట్టుకోలేక ఎంతో మంది సైనికులు 'మంచుకొరుకుడు' (frost bite) బారినపడి చనిపోయారు.

అసలు యుద్ధంలో కంటె ఇలా మంచుబారిన, మంచుపెళ్లలు విరిగిపడి కూరుకుపోయి, ఊపిరితిత్తుల వ్యాధి (Pulmonary edema) లంగ్స్‌లో నీరుచేరే వ్యాధిన పడిపోయినవారు ఎక్కువట."

రక్తంలో నైట్రోజన్ పాలు ఎక్కువవుతుంది. దానివల్ల చాలా దుష్ఫలితా లుంటాయట."

"అబ్బ వింటుంటే ఎన్ని అవస్థలుపడుతూ ఉంటున్నారక్కడ మన సైనికులు..." రాజేశ్వరి బాధగా అంది.

"జవాన్లకి, ఆఫీసర్లకి ఏదన్నా జబ్బులు చేస్తే వైద్యానికి కిందకి తీసుకురావల్సిందేనా" స్వప్న సందేహం.

"అక్కడే, ఆమంచుకొండల మధ్యే ఎమర్జెన్సీ కేసుల కోసం ఓ ఆసుపత్రి ఉంది. 'హండర్' అనే చోట - అంతా రెడీమేడ్ ప్రి ఫ్యాబ్రికేటెడ్, సెంట్రల్ హీటింగ్ సిస్టమ్ హట్స్... అంటే ఎప్పటికప్పుడు ఆ ఆస్పత్రి రెడిగా తయారుచేసేయొచ్చు ఓ టెంటు వేసినట్టు. అక్కడ ఆక్సిజన్, మందులు - ఎమర్జెన్సీ ఆపరేషన్ చేయడానికి డాక్టరు, సిబ్బంది అంతా రెడీగా ఉంటుంది.

రోజూ ఆక్సిజన్ అందక ఊపిరి తీసుకోలేనివారికి ఆక్సిజన్ పెడ్తారు. మంచు కొరుకుడు, ఊపిరితిత్తుల వల్ల ఆయాసం - అవి వచ్చే వారికి ప్రాథమిక వైద్యం

చేస్తారు. వారికి లొంగని కేసులని కింద 'బేస్ ఆస్పత్రికి' అక్కడ లొంగని కేసులని ఢిల్లీ మిలిటరీ ఆస్పత్రికి పంపించి వైద్యం చేయిస్తారు.

వైద్యం విషయంలో ఏలోటూ రానీయరు. డాక్టర్లు, నర్సులు, స్టాఫ్, వంటవాళ్ళూ, హెల్పర్లు, సోల్జర్లు, ఆఫీసర్లు... ఇలా ఎంత స్టాఫ్ కావాలో ఓ యూనిట్ కోసం..." అంటూ ఆగాడు మీనన్.

"రాజేష్... నాకు తెలియక అడుగుతా. ఈ సరిహద్దు గొడవలు సామరస్యంగా పరిష్కరించుకోవడం కుదరదా. ఎందుకీ యుద్ధాలు. కోట్ల ఖర్చులు, శ్రమ, ఇంత మంది చనిపోవడం... ఎన్నాళ్ళు ఇలా ఈ సరిహద్దుల్ని రక్షించుకోగలరు" అని అడిగింది రాజేశ్వరి.

"ఆంటీ చాలాసార్లు రెండు దేశాలమధ్య చర్చలు జరిగాయి - ఆ చర్చలు భారతదేశం ఆక్రమిత కాశ్మీరు అంశంతో ముడిపెట్టడం - ఇరువైపులా ఎవరూ తగ్గక పోవడం, మిలట్రీ అధికారులు ఎప్పటికప్పుడు లైన్ ఆఫ్ కంట్రోలు పర్మనెంట్‌గా గీసుకోవాలని చెప్పినా ప్రభుత్వ అధికారుల చర్చలు విఫలమవుతూనే ఉన్నాయి.

ఇరువైపులా ఒక అంగీకారానికి వచ్చే పరిస్థితులు వచ్చేసరికి ఏదో ఒక దాడులు, టెర్రరిస్టుల చొరబాట్లు, ముంబయి రైలు మీద దాడి, పార్లమెంట్ దాడులు జరగడం. ఈ ఉగ్రవాద దాడులకి పాకిస్థాన్ ప్రభుత్వం సహకరిస్తుంది. ముందు ఈ పరిస్థితులకి పరిష్కారం జరిగితే కాని సైన్యాన్ని ఉపసంహరించేది లేదని మన వాళ్ళు ముందు జాగ్రత్తగా ఉండడం.

పాకిస్థాన్‌కి ఈరక్షణ ఖర్చు తలకిమించినదవడం, అటు అమెరికా లాంటి అగ్రదేశాల ఒత్తిళ్ళు... అన్నీ టెర్రరిస్టులకి పాకిస్థాన్ మద్దతు ఇస్తూంది.

పాకిస్థాన్ గట్టిచర్యలు తీసుకోవాలన్నా, అన్ని దేశాల ఒత్తిళ్ళతో పాకిస్తాన్ సియాచిన్ విషయంలో రెండు దేశాలు ఓ ఒడంబడిక రావాలన్న నిర్ణయం తీసుకున్నా ఇంకా రెండు దేశాల ఫారెన్ సెక్రటరీలు, రక్షణ అధికారుల చర్చలు ఇంకా సఫలం అవలేదు.

టెర్రరిజాన్ని పెంచి పోషించిన పాకిస్థాన్ ఇప్పుడు తనూ టెర్రరిస్టు విధ్వంసక చర్యలకి గురి అవుతూ ఎటూ చెప్పుకోలేని సంకట స్థితిలో ఉంది.

చర్చలు కాస్త ముందుకి వెళ్ళి అంగీకారం త్వరలో లభిస్తుంది అనే వేళకి మళ్ళీ మొన్న ముంబయి దాడితో కథ కాస్తా మొదటికి వచ్చింది.

కార్గిల్, ఆక్రమిత కాశ్మీరు సమస్య తీరందే ఈ సరిహద్దు గొడవలు తీరవు. అప్పటి వరకు రెండు దేశాలు ఇలా బిలియన్లు ఖర్చుపెడుతూ అనేకమంది చావుకి కారణమవక తప్పదు" మీనన్ నిట్టూర్చి అన్నాడు.

"ఇప్పుడింకా నయం... 2003 సీజ్ ఫైర్‌కి ముందు సామాను దించడానికి హెలీకాప్టరు ముప్పై సెకన్లు మించి అక్కడ కనిపిస్తే చాలు వెంటనే అట్నించి కాల్పులు, ఒక సైనికాధికారి బాత్‌రూము కెళ్ళాలంటే ముందో సోల్జర్ ఒక రౌండు కాల్పు జరిపి మేం ఇక్కడ అప్రమత్తంగా ఉన్నామని హెచ్చరించేవారట.

సీజ్ ఫైర్ తర్వాత ఇరుపక్షాల మధ్య కాల్పులు తగ్గి పోయి కాస్త ప్రశాంతంగా ఉంటున్నారక్కడ.

రోజుకి కనీసం ఎవరో ఒకరు ఏదో కారణంగా ప్రాణాపాయ స్థితిలోపడి (వాతావరణం మూలంగా) చనిపోతూనే ఉన్నారట. ఇలా ఓ రెండు వేలమందిని పోగొట్టుకున్నాం. ఈ 20 ఏళ్లలో" రాజేష్ అన్నాడు.

అందరూ నిట్టూర్చారు. ఒక విషాదకథ విన్నట్లుగా.

* * * * * *

ఎనిమిది నెలల తరువాత - స్వప్న ఓ రోజు ఫోను చేసింది - "అత్తయ్యగారూ మీనన్ జ్ఞాపకం ఉన్నాడా, మీరు ఢిల్లీ వచ్చినప్పుడు మా ఇంట్లో చూశారు. ఆ మధ్య ఒకసారి మీరు అడిగారు కూడా అతని గురించి...." స్వప్న గొంతు అదోలా ధ్వనించింది.

"ఆ... ఆ... గుర్తులేకపోవడం ఏమిటి... ఏమయింది" రాజేశ్వరి ఆరాటంగా అడిగింది.

"అతను మూడురోజుల క్రితం పోయాడత్తయ్యగారూ" స్వప్న గొంతులో దుఃఖం.

"అదేమిటి... ఎలా..." కలవరపడింది రాజేశ్వరి.

"సియాచిన్ గ్లేసియర్‌కి వెళ్లాక ఓ నెల రోజులు బాగానే ఉన్నాడు. ఆ ఆల్టిట్యూడ్‌లో. తరువాత అతని ఆరోగ్యం క్రమక్రమంగా దెబ్బతింది.

ముందుగా ఆయాసం... తరువాత 'పల్‌మనరీ ఎడిమా' (Pulmonary edema)... కొన్నాళ్ళు అక్కడ ట్రీట్‌చేసి తగ్గకపోయేసరికి ఢిల్లీ మిలిటరీ హాస్పిటల్లో జాయిన్

చేశారు. రెండు ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిని ట్రీట్‌మెంట్‌కి రెస్పాండ్ అవలేదు - రాజేష్ వెళ్ళి చూసి వచ్చారు. అప్పటికే అంతా ఆశవదిలేశారు. ఆఖరికి మొన్న పోయాడు."

ఒక్క క్షణం పాటు రాజేశ్వరి నోటమాట రానట్లు నిశ్చేష్టురాలై మౌనంగా ఉండి పోయింది.

"పాపం నెలరోజులనించి ఎన్నిసార్లో ఫోనుచేసి ఒకటే ఏడుపు జ్యోతి..." స్వప్న బాధగా అంది.

"కాదు మరి, చిన్నవాడు - పిల్లలింకా చదువుల్లోనే ఉన్నట్లున్నారు. ఎలా వెళ్లదీస్తుందో రోజులు పాపం" రాజేశ్వరి కంట్లో నీరు తిరిగింది.

"డబ్బుకేం ఫరవాలేదు లెండి, డ్యూటీలో ఉండగా పోయాడు కనుక అతనికెన్నాళ్ళ సర్వీసు ఉందో అన్నాళ్ళు పూర్తి జీతం - తరువాత సగం జీతం, గ్రూఫ్ ఇన్స్యూరెన్స్ - జ్యోతికి కావాలంటే ఏదో ఉద్యోగం ... ఇవన్నీ బాగానే చూస్తారు. కాని మనిషి లేదు కదా. అంత చిన్న తనంలో ఒంటరిగా బతకాలి. సగం లైఫ్ ముందే ఉంది..." స్వప్న ఏడుస్తూ చెపుతోంది.

రాజేశ్వరికా క్షణంలో ఇలా ఎవరికి తెలియకుండా ఎంతమంది దేశరక్షణ కోసం ప్రాణాలు వదులుతున్నారు - మామూలు వాళ్ళకి ఎవరికీ ఈ విషయాలు తెలియనే తెలియవు అనిపించి హృదయం బరువెక్కింది. ఓ తల్లిగా బిడ్డను పోగొట్టుకున్న భావన కలిగింది. అప్రయత్నంగా అమృత వీరునికి జోహారులర్పించడానికి ఆమె సెల్యూట్ చేసింది.

(ఈకథలో టెక్నికల్ మిస్టేక్స్ ఉంటే విషయ సేకరణలో తప్పులు, పొరపాట్లు నావిగా భావించగలరు.)

(స్వాతి, అక్టోబరు 2009)